వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 47
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
నవంబర్ 04, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పులి సరోత్తం రెడ్డి

- ఉద్యోగ సంఘ నాయకుడిగా సుపరిచితుడే
- ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం
- బీజేపీ నుంచి పోటీకి ఆసక్తి
- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర
- అందరివాడిగా గుర్తింపు..

7లో..



# మహిళా సంఘాల్లో.. మాయాజాలం



వివరాలు 2లో..

- రుణం కావాలంటే కమిషన్ ఇవ్వాల్సిందే
- లక్ష లోనుకు వెయ్యి నుంచి మూడు వేలు వసూలు
- అధికారుల కనుసన్నల్లోనే దోపిడీ
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న అక్రమాలు



పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల పొదుపు సంఘాలను అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులే పక్కదారి పట్టిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో వారి అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల్లో ఎక్కువ సంఖ్యలో నిరక్షరాస్యులే ఉండడంతో వారికి కలిసొస్తోంది. మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నారు. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ పరిధిలోని పరకాల పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న దామెర మండలంలో అధికారుల చేతివాటంతో సుమారు కోటి రూపాయల వరకు దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. ఈ తతంగం అంతా ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ వారికి వచ్చే మామూళ్లు వారికి అందడంతో మిన్నకుంటున్నట్లు సమాచారం. దీంతో పేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన పొదుపు పథకాలు ఆయా శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు జేబులు నింపుకునేందుకే సరిపోతుందన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేద మహిళలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపట్టడంతోపాటు అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, దామెర



## భక్తులతో పోటెత్తిన శివాలయాలు

కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఈ సందర్భంగా న్యూ శాయంపేటలోని కోటమ్మ గుడి శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి సామూహిక రుద్రాభిషేకాల, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అందంగా అలంకరించి మహా హారతి ఇచ్చారు.

-వరంగల్ వాయిస్, వరంగల్



8లో..

## నా ప్రాణం వారిపైనే..

- ఆర్థిక సమస్యలు ఉన్నా అందరికీ మేలు చేస్తాం
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో విస్తృత స్థాయి సమావేశం



2లో..

## వినతులు వినవలే..

- వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ లో గ్రీవెన్స్
- బల్దియా కార్యాలయంలో 46 అర్జీలు



8లో..

## వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో 'దాస్యం'

# మహిళా సంఘాల్లో.. మాయాజాలం



- రుణం కావాలంటే కమిషన్ ఇవ్వాల్సిందే
- లక్ష లోనుకు వెయ్యి నుంచి మూడు వేలు వసూలు
- అధికారుల కనుసన్నల్లోనే దోపిడీ
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న అక్రమాలు

**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ద్వారానే దేశ పురోగతి సాధ్యమని భావించిన గత ప్రభుత్వం మహిళా సాధికారితకు పెద్ద పీట వేశారు. కొంతమంది మహిళలను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారికి ఒక మహిళా సంఘంగా గుర్తింపునిచ్చారు. అలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మహిళా సంఘాలు గ్రామ సమైక్య సంఘాలుగా ముందుకు సాగుతున్నాయి. మహిళా సంఘాల తరపున వారు అభివృద్ధి చెందడానికి రుణాలను అందజేస్తున్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తున్నందున బ్యాంకు అధికారులు సైతం వీరికే పలు రకాల రుణాలు అందించేందుకు సుముఖత చూపుతున్నారు. ప్రభుత్వం కూడా మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పొదుపు సంఘాల్లో చేరుతున్న మహిళలు పేదరికం నుంచి బయటపడేందుకు మార్గం సుగమం అవుతోంది.

### ఇంటి దొంగలు..

మహిళా సంఘాలకు సంబంధించిన గ్రూపులపైన ఆ గ్రామానికి చెందిన సీఏలను ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ఖాతా బుక్కులను నిర్వహిస్తున్నారు. అందరి సమక్షంలో తీర్మానాలను రాసి సంఘాలను సక్రమమార్గంలో నడిపించాల్సిన బాధ్యత వారిదే. అయితే ఇక్కడే నిర్వాహకులు అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. హనుమకొండ జిల్లాలోని పరకాల పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న దామెర మండలంలో సీఏలు తమ చేతివాటం ప్రదర్శించారు. సుమారు కోటి రూపాయల వరకు దుర్వినియోగం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. మహిళ సంఘాల్లో ఎక్కువ సంఖ్యలో నిరక్షరాసులే ఉండడంతో వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తప్పుడు లెక్కలతో మోసం చేస్తున్నట్లు అర్థమవుతోంది.



కొంతమంది మహిళా సంఘాలకు బ్యాంకుల నుంచి కొంత రుణం తీసుకొని వారు నెల నెల కిస్తీలు చెల్లిస్తున్నారు. అయితే కొందరు కిస్తీలు పూర్తిగా కట్టినప్పటికీ మరింత అప్పు ఉందంటూ లెక్కల పుస్తకాల్లో చూపించడంతో నిరక్షరాసులైన మహిళలు కంగు తింటున్నారు.

### అధికారుల కనుసన్నల్లోనే..

ఓ పక్క పొదుపు చేస్తూనే తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధికి అడుగులు వేస్తూ కుటుంబ ఆర్థిక అభివృద్ధిలో మహిళలు భాగస్వాములవుతున్నారు. స్త్రీనిధి ద్వారా అందించే రుణాలతో స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. అయితే తీసుకున్న రుణాల చెల్లింపులోనే గోల్ మాల్ జరుగుతోందన్న విమర్శలున్నాయి. ఒక లక్ష రూపాయల రుణం మంజూరు కావాలంటే కనీసం వెయ్యి నుంచి మూడు వేల వరకు వసూలు చేస్తున్నారంటున్నారు. మండలాధికారుల కనుసన్నల్లోనే ఈ తతంగమంతా జరుగుతున్నా వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు మహిళలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అయితే మహిళా గ్రూపుకి సంబంధించిన అవినీతి అక్రమాలను బయటపెడితే ఎక్కడ తమకు రుణం మంజూరు చేయకుండా ఆపుతారోనన్న భయంతో వారు కక్కలేక మింగలేక లోలోపలే మదన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిత్యం కూలి పనులు చేసుకునే నిరక్షరాసులైన మహిళల దగ్గరినుంచి రుణాల మంజూరు కోసం కమిషన్ తీసుకోకుండా డబ్బులు అందిస్తే బాగుంటుందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వినతులు వినవలే..



- వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ లో గ్రీవెన్స్
- బల్దియా కార్యాలయంలో 46 అర్జీలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ లతోపాటు వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వరంగల్ కలెక్టరేట్ లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొనగా, హనుమకొండ కలెక్టరేట్ లో జిల్లా ఆదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ కు ప్రజలనుంచి భారీ స్పందన లభించింద. వరంగల్ కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో మొత్తం 87 దరఖాస్తులు రాగా అందులో 34 రెవెన్యూ సమస్యలకు చెందినవి కాగా కలెక్టరేట్ సంబంధించిన సమస్యలపై 10, డీఆర్డీఓ సమస్యలపై 8, జీడబ్ల్యూఎంసీ పై 9 దరఖాస్తులు రాగా మిగతావి వివిధ శాఖలకు సంబంధించినవిగా ప్రకటించారు. వాటిని వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ (ఇంచార్జి అడిషనల్ కలెక్టర్) వరంగల్ విజయలక్ష్మి, ఆర్డీఓ శ్రీపాల్ రెడ్డి, డీఆర్ డీఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. గత వారం సమర్పించిన దరఖాస్తులలో ఎక్కువ మొత్తం దరఖాస్తులు పెండింగ్ లోనే ఉన్నాయని వాటిని త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. సాధ్యం కాకుంటే దరఖాస్తుదారునికి అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. గ్రీవెన్స్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

### హనుమకొండలో..

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కు 73 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేయగా హనుమకొండ జిల్లా ఆదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### జీడబ్ల్యూఎంసీలో..

వరంగల్ మహా నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో అదనపు కమిషనర్ జోనా, ఇతర విభాగాల ఆధికారులు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగంలో 10, టౌన్ ప్లానింగ్ విభాగంలో 24, హెల్త్, సానిటేషన్ విభాగంలో ఆరు, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) లో ఐదు, తాగునీటి సరఫరాకోసం ఒక దరఖాస్తు మొత్తం 46 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజిరెడ్డి, హెచ్ఓ రమేష్, బయలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్చార్జి సీపీ రవీంద్ర, డిప్యూటీ కమిషనర్లు కృష్ణా రెడ్డి, ప్రసన్న రాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, టీఓ బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన సత్యమూర్తి



**వరంగల్ వాయిస్, మడికొండ :** మడికొండలోని శ్రీ సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో ఆదివారం జరిగిన తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ ఆయిల్, సీడ్స్, గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, సుజాత దంపతుల కుమార్తె నిఖితా రెడ్డి–అవినాష్ రెడ్డి ల వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొనగా వారికి శ్రీ సత్యసాయి కన్వెన్షన్ ఛైర్మన్, శ్రీ సత్యసాయి ఇన్ ఫ్రాస్టక్చర్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో వేముల సత్యమూర్తి ఘన స్వాగతం పలికారు. వీరి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఈ సందర్భంగా వేముల సత్యమూర్తి ఆకాంక్షించారు.

# కులగణన నుంచి మినహాయించండి

**డీఆర్వో గణేష్ కు దివ్యాంగ ఉపాధ్యాయుల వినతి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న కులగణనలో తమను మినహాయించాలని దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా డీఆర్వో గణేష్ ను కలిసి వినతిపత్రం అందించారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించే పనులను దివ్యాంగులకు కేటాయంచడం బాధాకరమన్నారు. అధిక వైకల్యం కలిగినఉపాధ్యాయులు, అంధ ఉపాధ్యాయులు ఎవరి సపోర్ట్ లేనిదే నడవటం కష్టతరమైన సందర్భంలో వారు కులగణనలో ఇంటింటికి తిరుగుతూ ఎలా విధులను నిర్వర్తిస్తారని ప్రశ్నించారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం వారి అనుమతి లేనిదే ఎలాంటి అదనపు బాధ్యలు ఇవ్వకూడదని చెప్పినప్పటికి దానికి విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే విధులు కేటాయించడాన్ని ఖండిస్తున్నట్లు పెర్కొన్నారు. వెంటనే వారిని విధులనుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు వాసుదేవరెడ్డి, స్వరూప, వెంకటేశ్, సృజన, సులోచన తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, నవంబర్ 04, 2024

# కుంకుమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

◆ **అన్నదానం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చల్లా**



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు బండి సారంగపాణి ఏర్పాటుచేసిన మహా అన్న ప్రసాద కార్యక్రమమాన్ని పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మొదటగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ పరమేశ్వరుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరినట్లు వారు తెలిపారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

## నేతాని శ్రీనివాస్ రెడ్డికి పరామర్శ..

కొద్ది రోజులుగా కంటి సమస్యతో బాధపడుతున్న పరకాల సీనియర్ బీఆర్ఎస్ నాయకులు నేతాని శ్రీనివాస్ రెడ్డిని హనుమకొండలోని వారి నివాసంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట పరకాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతి రెడ్డి మధుసూదన్ రెడ్డి, కార్పొరేటర్ సుంకరి శివకుమార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ, పరకాల, నడికూడ మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజలకు చేయూత




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కలెక్టరేట్ వరంగల్ లో ప్రతి సోమవారం జరుగుతున్న "ప్రజావాణి " కార్యక్రమంలో సమస్యలపై వస్తున్న దరఖాస్తుదారులకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ ఉచితంగా దరఖాస్తులు రాసి ఇస్తున్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ దరఖాస్తులు రాయబడుచున్నాయి. కాబట్టి, సమస్యలపై వచ్చే దరఖాస్తుదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, ఎం.సదానందం, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు గోవర్ధన్, సహాయక సెక్రటరీ ఏ.రాజేంద్రప్రసాద్, డి.రాజమౌళి, సత్యనారాయణ, విజయ కుమారి పాల్గొన్నారు.

# కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వర దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా మొదటి సోమవారం కాశీ విశ్వేశ్వరుడికి తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు. మంత్రి రాష్ట్రంలోని దేవాలయాలను కాపాడుతూ అన్ని దేవాలయాల్లో భక్తుల కోసం లోక కళ్యాణార్థం యాగాలు చేస్తూ అందరి మంచి కోరే కొండా దంపతులు ముక్కోటి దేవుళ్లు చల్లగా చూడాలవాలయంలో పూజలు చేయించడం జరిగింది. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, 20వ డివిజన్ అధ్యక్షులు కుసుమ సతీష్ బాబు, జంగం ప్రభాకర్, పల్లకొండ రాజమణి, శ్రీనివాస్, కె వెంకటేశ్వర్లు, కిషోర్, గరిగ రమేష్, మాదినేని మల్లేశం, ఆలయ ఈవో వెంకట్రావు, దేవాలయ అర్చకులు గుండేటి రజనీ కుమార్, మార్త మోహన్, మార్త దీపక్, అంకం కళ్యాణ్, దేవాలయ అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, కొండా అభిమానులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదల చేసే వరకు పోరాటాలు ఆగవు

➲ **ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా కేంద్రం శివనగర్ తమ్మేర భవన్ ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో సోమవారం జిల్లా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇంచార్జి రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థుల చదువులు కొనసాగేది ఎట్లా అని గతంలో ఫీజు బకాయిలపై ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు నేడు చేస్తున్న వాటికి ఎటువంటి పొంతన లేదన్నారు. సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి భవిష్యత్తుతో ఆటలాడకూడదని, వారిపట్ల వివక్ష చూపకుండా తక్షణమే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలనీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీవ్రమైన కృషి చేశారు. అయినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను కూడా తన దగ్గరే పెట్టుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. విద్యారంగం సమస్యలపై ఇంతవరకు ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించని పరిస్థితిలో సీఎం రేవంత్ ఉన్నారు. సాక్ష్యాత్తు విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉండటం వలన రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని అందరూ భావించారు కానీ నేడు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. గురుకులాల్లో ఉన్న విద్యార్థులు




తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న వాటికి ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో వారు వాటికి తాళాలు వేయడం జరిగింది. విద్యార్థులు స్వచ్ఛందంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్న అధికారుల్లో చలనం కూడా లేదని, సాంఘిక, సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలు పరిష్కారం చూపకపోవడం, నాణ్యతతో కూడిన భోజనం పెట్టకపోవడంతో అనేక మంది విద్యార్థులు అనారోగ్యబారిన పడటం, ఇవన్ని సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే విద్యారంగంపై సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థ సారథి, ల్యాదల్లా శరత్, నాయకులు అభిరామ్, రాకేష్, శ్రీధర్, శివకుమార్, సంతోష్, రాజు, ఖలీల్, ప్రభాస్, సోను, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరమ పవిత్రం.. కార్తీక మాసం

## మహాదేవ స్వామి ఆలయంలో పూజలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పరమ శివుడికి అత్యంత ప్రీతి పాత్రమైన కార్తీక మాసం మొదటి సోమవారం రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, వేదమంత్రాలతో ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు తెల్లవారుజామున నుంచే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయానికి క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయాలు నూతన శోభను సంచరించుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూరేళ్ల ఉపేందర్ రేణుక దంపతులు మాట్లాడుతూ కార్తీక మాసం నెల రోజులు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి నేత, ఆలయ పూజారి పిండిపూలు శ్రీనివాస్ శర్మ, స్థానిక వ్యాపార వేత్తలు గందె రవి దంపతులు, బిల్దే శ్రీనివాస్ గుప్తా, సోమేశ్వర్ గుప్తా, లింగయ్య గుప్తా, బచ్చు చిరంజీవి దంపతులు, ఇమ్మడి శెట్టి హరికృష్ణ, మహిళలు భక్తులు ఆకుల జ్యోతి, కొన్నె రమ, గందె మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయ భూమి కేసును ఉచితంగా వాదిస్తా

## హైకోర్టు అడ్వకేట్ సాంబార్ ప్రభాకర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశీ విశ్వేశ్వర రంగనాథ స్వామి దేవాలయ భూమిపై హైకోర్టు అడ్వకేట్ సాంబార్ ప్రభాకర్ స్పందించారు. ఈ సందర్భంగా సాంబార్ ప్రభాకర్ మాట్లాడుతూ వరంగల్ మండలంలోని లక్ష్మీపురం గ్రామ శివారు 212 సర్వే నెంబర్ లో గల 28 గుంటల దేవాలయ భూమిపై వరంగల్ జిల్లా కోర్టులో కేసు గెలిచామన్నారు. అలాగే, హైకోర్టులో కూడా దేవాలయానికి సంబంధించిన భూమిని కాపాడుతామన్నారు. హైకోర్టులో ఉచితంగా కేసును వాదిస్తానని సాంబార్ ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# గణపేశ్వరాలయాన్ని సందర్శించిన పర్యాటకులు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కాకతీయ శిల్ప సంపద కోటగుళ్లను సోమవారం పర్యాటకులు పలువురు సందర్శించారు. ఆలయ శిల్పకళా వైభవాన్ని గావించి గుళ్లు అద్భుతంగా ఉన్నాయని అబ్బురపడ్డారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ నుంచి జయకృష్ణ మానసిక ఆసుపత్రికి చెందిన డాక్టర్ జగదీష్ బాబు కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించారు. గణపేశ్వర స్వామికి పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయానికి పూజ ద్రవ్యాలను, గోశాలకు రూ.3200 వితరణ చేశారు. కార్తీక పౌర్ణమి కార్యక్రమాలకు తన వంతు ఆర్థిక సాయం అందించాలని డాక్టర్ జగదీష్ బాబు తెలిపారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## ◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండల పరిధిలోని కొండపర్తి గ్రామంలో సరస్వతి గ్రామైక్య సంఘం వారి ఆధ్వర్యంలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అని, వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రూ.500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. ఇక భారతదేశానికి ఆనాడు రైతులకు లక్ష రుణమాఫీ, నేడు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదే అని కొనియాడారు. దేశానికే అన్నం పెట్టే ధాన్యాగారంగా తెలంగాణ మారుతుందని తెలిపారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవ్వరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలు అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సమాఖ్య మహిళలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వేను విజయవంతం చేయాలి

## జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేత సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉపాధికై కులగనన సర్వే ఈనెల 6 నుంచి మొదలవుతుందని, దాన్ని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బీసీ నేత సాయిలి ప్రభాకర్ అన్నారు. రాహుల్ గాంధీ తీసుకున్న ఈ కుల గణన నిర్ణయం దేశ చరిత్రలో నిలిచిపోతుందని ఈ సందర్భంగా తెలిపారు. దీని ద్వారా అన్ని కులాలకు సమాన న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు బీసీల వ్యతిరేకులుగా చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. బీసీ ప్రధాని అని చెప్పుకునే నరేంద్ర మోదీ కులగణనపై స్పందించకుండా బీసీ వ్యతిరేకిగా మిగిలారన్నారు. ఈ కులగణన సర్వేకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరం సర్వేలో పాల్గొని అధికారులకు సహకరించి సక్సెస్ చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ ప్రజలను, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కోరారు.

# దేవులపల్లి రమేశ్ కు జాతీయ సాహిత్య పురస్కారం



**వరంగల్ వాయిస్, సిద్దిపేట :** హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరిగపూడి పూర్ణ చంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి లయన్ ఏ కృష్ణ కుమారి స్మారక జాతీయ పురస్కారాలు అందజేశారు. సాహిత్య సేవలు అందించినందుకు గాను నంగునూర్ కు చెందిన దేవులపల్లి రమేశ్, ఎంజేపీ గురుకుల పాఠశాల, తెలుగు అతిథి ఉపాధ్యాయుడికి సాహిత్య సేవ పురస్కారం వరించింది. ఈ మేరకు ముఖ్య అతిథులు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ రజిని, జస్టిస్ చంద్రకుమార్, నిర్మాత కంఠంనేని రవి శంకర్, డా.బిక్కి కృష్ణ, డా.విజయ్ కుమార్ చేతులు మీదుగా పురస్కారం అందుకున్నారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సాహిత్య పురస్కారం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి డా. రాధ కుసుమ, డా. జెల్ది విద్యాధర్, నాళేశ్వరం శంకరం, రామ కోటేశ్వరరావు, రవీంద్ర బాబు, ప్రముఖ టీవి యాంకర్లు, పత్రిక ఎడిటర్లు, జర్నలిస్ట్ లు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ, ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 5న మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ మహాధర్నా పోస్టర్ ను వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ ఆవిష్కరించారు.

# డీసీసీ బ్యాంకు భవన నిర్మాణానికి స్థలం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో డీసీసీ బ్యాంకు భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గ్రామపంచాయతీ పాత భవనం స్థలాన్ని స్వయంగా వచ్చి పరిశీలించి ఆమోదించారు. దీంతో సోమవారం తహసీల్దార్ మధుర కవి సత్యనారాయణ స్వామి, ఆర్ఐ దేవేందర్, సర్వేయర్ తదితరులను ప్రదేశం వద్దకు పంపగా సదరు స్థల విస్తీర్ణాన్ని గావించారు. వెంటనే మ్యాప్ తయారు చేసి రెవెన్యూ శాఖ అనుమతితో కూడిన స్థలం స్వాధీన పత్రాలను డీసీసీ బ్యాంకు అధికారులకు పంపించినట్లు తెలిసింది.

# టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ జిల్లా కన్వీనర్ గా దీపక్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 59వ డివిజన్ కు చెందిన కేతిడి దీపక్ రెడ్డిని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ హనుమకొండ జిల్లా కన్వీనర్ గా నియమిస్తూ టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ చైర్మన్ సామా రాం మోహన్ రెడ్డి ఉత్తరువులు జారీ చేశారు. ఈ నియామకపు పత్రాన్ని సోమవారం వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా కేతిడి దీపక్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్న తనను, తన సేవలు గుర్తించి టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ హనుమకొండ జిల్లా కన్వీనర్ గా నియమించడం జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ల నాయకత్వంలో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి తన వంతు పాత్ర పోషిస్తానన్నారు. హనుమకొండ జిల్లా కన్వీనర్ గా నియమించినందుకు, తన నియామకానికి సహకరించిన టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ చైర్మన్ సామా రాంమోహన్ రెడ్డి, సెక్రెటరీ గీత అయినాల, వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తమ తమ ఇండ్లలో పాడుబడిన వస్తువులలో నీరు నిలిచి ఉండటం వలన దోమలు పుట్టుక వచ్చి ప్రజలను అనారోగ్య పాలు చేస్తున్నందున ఇంటి యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం డివిజన్ లోని నాన మీయా తోటలో నివసిస్తున్న మండల భిక్షపతికి ఎంజీఎం దవాఖాన డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ వ్యాధి అని గుర్తించినందున అట్టి వారి ఇంటికి కార్పొరేటర్ మరుపల్ల రవి మలేరియా సిబ్బంది శానిటేషన్ సిబ్బందితో కలిసి చుట్టుప్రక్కన గల ఇంటి పరిసరాలు పరిశీలించారు. పాత డ్రమ్ములలో వర్షం నీరు నిల్వ ఉన్న దానిని గుర్తించి వెంటనే ఇంటి యజమానులకు అవగాహన కల్పించి మురుగు నీటిని పారబోయించారు. డెంగీ వ్యాధి కలిగిన భిక్షపతి ఇంటి చుట్టూ ఉన్న ఇండ్లలో మలేరియా సిబ్బందిచే రసాయనిక పదార్థాలను ఇండ్లలో స్ప్రే చేయించారు. ఈ పరిశీలనలో హెల్త్ అసిస్టెంట్ పెండ్యాల బాబు, స్థానికులు ప్రశాంత్, కరీం, రజియా, రజిత, జవాన్ ప్రశాంత్, మలేరియా సిబ్బంది ప్రదీప్, కార్తీక్, గణేష్, సరిత ఉన్నారు.

# అసమానతలు లేని సమాజాకికై నిరంతర పోరాటాలు

## భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి




వరంగల్ వాయిస్, జనగామ : దేశంలో ప్రజాస్వామిక విలువలతో దృక్పథంతో పరిపాలన కొనసాగించినప్పుడు మాత్రమే అణిచివేతలు, అసమానతలు, అత్యాచారాలు, అవమానాలు పీడన వివక్ష దోపిడీ లేని సమస సమాజాన్ని నిర్మించుకోవడం నేటి పౌర సమాజం ఆవశ్యకత అని నేదునూరి జ్యోతి పేర్కొన్నారు. మహిళా సమాఖ్య జనగామ జిల్లా కౌన్సిల్ సమావేశం సోమవారం జనగామలోని పార్టీ కార్యాలయంలో పండుగ నిర్మల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ తరతరాలుగా ప్రాంతాల మధ్య, వ్యక్తుల మధ్య విభేదాలను సృష్టిస్తూ అసమానతలను పెంచి పోషించి ఐక్యతకు విఘాతం కలిగించడం వలన ప్రజాస్వామిక పోరాటాలు ప్రతిఘటన పోరాటాలుగా రూపాంతరం చెందడం అనివార్యం అవుతుందన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో మహిళలకు ప్రథమ స్థానం కల్పించినప్పుడే మహిళా సాధికారిక సాధ్యమవుతుందని నేదునూరి జ్యోతి తెలిపారు. సంఘటిత రంగం, అసంఘటిత రంగం కొత్తగా ఏర్పడిన మాల్స్ అయిన డీ మార్ట్ , స్పెన్సర్స్ లాంటి వాటిలో తక్కువ వేతనాలు ఇస్తూ ఎక్కువ శ్రమ దోపిడిని కొనసాగిస్తున్న దోపిడి వ్యవస్థపై మహిళా లోకం కన్నెర్ర చేయక ముందే పాలకులు కనీస కార్మిక చట్టాల్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సరైన వేతనాలు, విరామ సమయంలో కూర్చోవడానికి కనీస స్టూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకురాలు సుగుణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి సఖి గుగులోత్ లీలా, వినోద, విమల, మంజుల, సువర్ణ, ఈరమ్మ, ఆదిలక్ష్మి, నాగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 6న ఘనంగా గోకుల్ సధర్ సమ్మేళనం

## విజయవంతం చేయాలని సుందర్ రాజ్ యాదవ్ పిలుపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల 6న హనుమకొండ నగరంలో జరిగే గోకుల్ సధర్ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ కూడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ గోకుల్ నగర్ జంక్షన్ పరిధిలోని ఏంఆర్ సీబీ బ్యాంకెట్ హాల్ లో బంక సంపత్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 6న సాయంత్రం హనుమకొండలోని గోకుల్ నగర్ ఓల్డ్ బస్ డిపో రోడ్డులోని గోకుల్ సధర్ సమ్మేళన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. యావత్ తెలంగాణ యాదవ ప్రతిష్టాత్మక సధర్ సమ్మేళనం రాజకీయం, కుల,మతాలకు అతీతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సధర్ సమ్మేళనం కార్యక్రమాన్ని వరంగల్ నగరంలో మొదటి సారిగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎంపీ అనిల్ యాదవ్, లడ్డు యాదవ్, సినీ ప్రముఖులు, పలువురు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంస్కృతి, ఆటలు, పాటలు, నృత్యాలు ఉంటాయని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం సధర్ సమ్మేళనం కార్యక్రమాన్ని రెట్టింపు చేస్తామని, అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల రవీందర్ యాదవ్, షైన్ కాలేజీ గ్రూప్స్ చైర్మన్ ముగుల కుమార్ యాదవ్, గగ్రబోయిన రాజయ్య యాదవ్, చల్ల రాజు యాదవ్, వెంకన్న యాదవ్, బొంగు రాజు యాదవ్, బంక సతీష్ యాదవ్, ఎల్లావుల సతీష్ యాదవ్, బుట్టి శ్యామ్ యాదవ్, రాజేందర్ యాదవ్, సిద్ధి రాజ్ యాదవ్, వేల్పుల భిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ తో సమస్యలకు పరిష్కారం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సంబధిత శాఖల అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్ రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, ఏడీ ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డీఏఓ విజయనిర్మల, డీపీఓ హరిప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డీడీ గ్రౌండ్ వాటర్ వి.సురేష్, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డీహెచ్ఓ జి.మరియన్న, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా నాయక్, జిల్లా మైనింగ్ అధికారి ఏ.వెంకట రమణ, మెప్మా పీడీ విజయ, ఎంప్లాయిమెంట్ అధికారిణి రజిత, మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల అరెస్ట్



**వరంగల్ వాయిస్, నడికూడ :** సర్పంచుల బిల్లుల కోసం శాంతియుతంగా నిరసన తెలియజేసేందుకు హైదరాబాద్ కు తరలివెళుతుంటే తమ ఇంటిపై పోలీసులు దాడి చేసి పరకాల పోలీస్ స్టేషన్ కు తరలించడం అన్యాయమని సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు సాంబశివరెడ్డి మండిపడ్డారు. అరెస్టైన వారిలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సాంబశివరెడ్డి, నడి కూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, పులిగిల్ల మాజీ సర్పంచ్ సదానందం, ముస్తాలపెల్లి మాజీ సర్పంచ్ రవీందర్, నడికూడ, పరకాల మండల మాజీ సర్పంచులు ఉన్నారు.

# రంగనాథ స్వామి ఆలయంలో కమ్యూనిటీ హాల్స్ కై సర్వే



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని ప్రసిద్ధిగాంచిన కాశీ విశ్వేశ్వర రంగనాథ స్వామి దేవాలయం భూమిలో సోమవారం తెలంగాణ మంత్రి కొండా సురేఖ-మురళీధర్ రావు అదేసానుసారం దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో కాశీ విశ్వేశ్వర దేవాలయ పక్కనున్న స్థలంలో కళ్యాణ మండపం, రంగనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్స్ కోసం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అంబి సాంబరాజు, దేవాదాయ శాఖ ఈవో, ఎన్ వెంకట్రావు, దేవాదాయ ఇంజినీరింగ్ సభ్యులు, ఏఈ సునీల్, సభ్యులు పాల్గొన్నారు.

# యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇచ్చిన హామీలు అమలు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ, రాంనగర్ సుందరయ్య భవన్ లో జరిగిన డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో రమేష్ పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు అధికారంలోకి రావడంతోనే ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని, ఎన్నికల అప్పుడే యువత గురించి మాట్లాడే పాలకులు ఎన్నికల తర్వాత ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఓట్ల కోసమే యువతను వాడుకుంటున్నారని, కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఉద్యోగాలు ఇచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ ప్రభుత్వం ఉన్న ఉద్యోగాల తొలగిస్తుందని, ఇప్పటికీ రైల్వేలో కొత్తగా రిక్రూట్ మెంట్ చేసిన దాఖలా లేవని, ప్రైవేటు కార్పొరేషన్ సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ సంస్థలను విస్మరిస్తుంది. యువత పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి ఓ.చిరంజీవి, నాయకులు జంపాల రమేష్, జె.కుమార్, అశోక్, సంతోష్, బాబు, రాజేందర్, సతీష్, రాజు, నవీన్, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

# మావోయిస్టుల ఆరోపణల్లో నిజం లేదు




**వరంగల్ వాయిస్, మల్హర్ :** బీఆర్ఎస్ నాయకులు దళిత బంధు పేరుతో లబ్ధిదారుల వద్ద లక్షలు వసూలు చేశారని మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని మండల మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు గోనె శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ నేను, నా కుటుంబం గత ముప్పై సంవత్సరాలుగా ప్రజా సేవలో ఉన్నామని, మల్లారం సర్పంచ్ , మండల జడ్పీటీసీ, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడిగా అనేక పదవులు నిర్వర్తించానని, అనేక మార్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఏనాడూ అవినీతికి పాల్పడిన దాఖలాలు లేవని, నాపై కొందరు రాజకీయ ప్రత్యర్థులు చేసిన ఆరోపణలు విని వాటిని నమ్మి మావోయిస్టు పార్టీ నిజ నిజాలు తెలుసుకోకుండా హెచ్చరికలు, పత్రిక ప్రకటనలు చేయడం సరైంది కాదని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# గ్రామాల్లో పోలీసుల గస్తీ

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం జరిగిన రెండు వరుస చోరీల సంఘటనలతో గ్రామస్తులు కంటి మీద కునుకు లేకుండా రాత్రి వేళలో దొంగల భయంతో గడిపారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.. ఎస్సై రేఖ అశోక్ వెంటనే దొంగల భయం పోగొట్టి గ్రామస్తులు నిర్భయంగా గుండెల మీద చేతులు వేసుకొని ప్రశాంతంగా నిద్ర పోవడానికి చర్యలకు పూనుకున్నారు. వాడకు ఇద్దరు పోలీసులు చొప్పున ద్విచక్ర వాహనాలపై గస్తీ తిరుగుతున్నారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండేందుకు అలాగే దొంగలు పోలీసులు గస్తీ తిరుగుతున్నారని దడ పట్టించడానికి ద్విచక్ర వాహనాల నుంచి ప్రత్యేక సైరన్ (హారన్) వినిపిస్తూ వాడల్లో పోలీసులు గ్రామస్తుల్లో ధైర్యం నింపుతున్నారు. కాగా, పోలీసులు గస్తీ తిరుగుతున్నప్పటి నుంచి దొంగతనాల సంఘటన లేవి జరగలేదు. కాగా, బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని దొంగలను పట్టుకోడానికి పోలీసులు రంగంలోకి దిగారు.

# ఒరో యాప్ వివరించిన దాస్యం అభినవ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనే ధ్యేయంగా రూపొందించిన ఏఐ ఆధారిత ఒరో యాప్ కు సంబంధించిన వివరాలను, ఆ ప్లాట్ ఫాం అవశ్యకతను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ రంజన్ ను గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్ కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి తెలిపారు. ఈ సందర్భంగా జయేశ రంజన్ మాట్లాడుతూ నూతన టెక్నాలజీతో తయారు చేయబడిన ఈ యాప్ ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందని, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణకు ఓరోను అనుసంధానం చేసి తెలంగాణలో అమలు పరుస్తామని తెలియజేశారు.

# ఫిర్యాదులను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై వినతి పత్రాలను అందజేయగా హనుమకొండ జిల్లా ఆదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజలు అందజేసిన ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.వీ గణేష్, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, నవంబర్ 04, 2024

## ఎంబీబీఎస్ విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రమైన దళిత బిడ్డ మునిగే మీనాక్షి ఎంబీబీఎస్ సీట్ రావడంతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్ పూర్తైన తర్వాత పేదోళ్ళందరికీ ఉచితంగా వైద్యం అందించాలని కోరుతూ ఉన్నతమైన స్థానాలకు వెళ్లాలని ఆశీర్వదించారు. మీనాక్షి తండ్రి చేరాలు నెక్కొండ మండలంలో పోలీస్ శాఖలో హోమ్ గార్డ్ గా పని చేస్తున్నారు.

## నిస్వార్థంగా సేవలు అందించడమే పోలీసుల కర్తవ్యం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** 2009లో పోలీస్ కానిస్టేబుల్స్ గా భర్తీ అయ్యి చిత్తశుద్ధితో ప్రజలకు పోలీస్ సేవలు అందిస్తూ 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ బ్యాచ్ పోలీసులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ను మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 15 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా నిజాయతీగా, నిస్వార్థంగా ప్రజలకు పోలీస్ సేవలు అందించడాన్ని అభినందించారు. ఇలానే సేవలు అందిస్తూ పదోన్నతులు పొంది ఇంకా పై స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. 15 వసంతాలు పూర్తి చేసుకున్నందుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నల్ల నరసింహులు విగ్రహావిష్కరణకు తరలిరండి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరుడు నల్ల నర్సింహులు విగ్రహాన్ని జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరణకు పద్మశాలి చేనేత కార్మికులు తరలిరావాలని జనగామ జిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పద్మశాలి కుటుంబంలో పుట్టి ఉమ్మడి రాష్ట్రంలో అనేక భూ పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన నల్ల నర్సింహులు ఆశయ సాధన కోసం ప్రతి పద్మశాలి చేనేత కార్మికులు కృషి చేయాలని ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తూ అనంతరం బహిరంగ సభ ఉంటుందని ఆయన తెలిపారు.

## ఆహార దినుసుల అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** యైటింక్లెయిన్ కాలనీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నూక రమేష్ ఆధ్వర్యంలో 15 నిరుపేద కుటుంబాలకు "అమృత కలశం "పేర వివిధ రకాల ఆహార దినుసులను అందజేశారు. ఈ సేవా కార్యక్రమంలోకి తనని ఆహ్వానించిన సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు నూక రమేష్, సానా రామకృష్ణారెడ్డి, మల్లయ్య, బుగ్గాజీ, కిష్టయ్యలకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు పి.శ్రావణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# రైస్ మిల్లర్లు నిబంధనలు పాటించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో రైస్ మిల్లర్లు, మిల్లులను నిర్వహించాలని, నిర్దేశించిన ప్రకారం బ్యాంకులకు ఒప్పందాలు సమర్పించాలని, సీఎంఆర్ డెలివరీ అయిన తర్వాత లారీలను వెంటనే పంపాలని ధాన్యం కొనుగోలు అనంతరం దిగుమతి నివేదికలను వెంటనే సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన లక్ష్యాలను సకాలంలో మిల్లర్లు పూర్తి చేయాలన్నారు. ఏ, బీ, రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ, గిరిజన కార్పొరేషన్, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి అన్ని విభాగాలు కలిసి పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఆర్డీఓ కృష్ణవేణి, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అంబరీష్, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఏఓ విజయనిర్మల, మండలాల నుంచి తహసీల్దారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ దొంగ అరెస్టు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలోకి వెళితే రహమత్ పుర, ఎల్బీనగర్, వరంగల్ కు చెందిన మహమ్మద్ వసీం (35) అనే వ్యక్తి తనకు వచ్చే జీతం కుటుంబం అవసరాలకు సరిపోకపోయే సరికి సులువుగా డబ్బు సంపాదించాలని అత్యాశతో బైకు దొంగతనాలు చేసి అవి గుర్తు తెలియని వ్యక్తులకు తక్కువ ధరకు అమ్మి వచ్చే డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో సోమవారం అలంకార్ జంక్షన్ వద్ద బైక్ కన్సల్టెన్సీలకు గుర్తు తెలియని వ్యక్తి తక్కువ ధరకు బైక్ లను అమ్ముతున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు అక్కడ వెళ్లి పరిశీలించగా పై నిందితుడు పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకొని అతడి నుంచి మూడు హోండా యాక్టివా బండ్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై పలు పోలీస్ స్టేషన్లలో బైక్ దొంగతనం కేసులు ఉన్నాయని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్ చేసి జైలుకు పంపించడం జరిగిందని హనుమకొండ ఇన్ స్పెక్టర్ వై. సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ కే.సతీష్, క్రైమ్ హెడ్-కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ మాహేశ్వర్, సంజీవ్, భాస్కర్ లను ఇన్ స్పెక్టర్ వై.సతీష్ అభినందించారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

### ఐఏఎల్ జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలో నవంబర్ 30, డిసెంబర్ 1న జరుగనున్న భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ కోరారు. హనుమకొండలో నిర్వహించ తలపెట్టిన ఐఏఎల్ రాష్ట్ర మహా సభలకు విజయవంతం చేసేందుకు సోమవారం సన్నాహక సమావేశం హనుమకొండ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ఐఏఎల్ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ముఖ్య కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయుటకు తగు సూచనలు, అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, విజయ భాస్కర్ రెడ్డి, బీమానాథ్ శ్రీనివాస్, గంజి గణేష్, బిల్లా ప్రభాకర్, మేరుగు సుభాష్, కొత్తపెల్లి చిరంజీవి ఉత్తమ్ కుమార్, వల్లి ఉల్లా ఖాద్రి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడిగా ఎంఏ హమీద్



**వరంగల్ వాయిస్, రేగొండ :** నూతన గొరికొత్తపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంఏ హమీద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా కానుగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కాశెట్టి మోహన్ రావు, రేగుల మహేందర్, జూపాక దాసు, కున్నూరు సదానందం, ప్రధాన కార్యదర్శులు దండెబోయిన సంతోష్, తిప్పారపు శ్రీనివాస్, జూపాక భాస్కర్, కార్యదర్శులు ఓన్నాల శంకర్, మార్క కమలాకర్, కోశాధికారి మేకల సాంబయ్య, సభ్యులు గుంటుక లక్ష్మీకాంతం, జువ్వాజి తిరుపతి, బమ్మ ఎల్ల స్వామి, పనశ రాంబాబు, మండల యూత్ అధ్యక్షుడు పకిడే కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు కొట్టే రమేష్, భాషబోయిన రాకేష్, యాట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి బండారి తిరుపతి, కార్యదర్శి కర్రే రాకేష్, కోశాధికారి అక్కల రాహుల్, నియమితులయ్యారు. అనంతరం కమిటీ సభ్యులకు, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్ పర్సన్, భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వారికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఎంఏ హమీద్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, నాయకులను కలుపుకొని పార్టీ కార్యకలాపాలు చేపడతానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, జిల్లా నాయకులకు, మండల నాయకులకు ఎంఏ హమీద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాంబారి సాయికుమార్ పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, నవంబర్ 04, 2024



# టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పులి సరోత్తం రెడ్డి

సమర్థత, పలుకుబడి కలిగిన సరోత్తం రెడ్డికి బీజేపీ టికెట్ కేటాయిస్తే విజయం నల్లేరుమీద నడకే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- ఉద్యోగ సంఘ నాయకుడిగా సుపరిచితుడు
- ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం
- బీజేపీ నుంచి పోటీకి ఆసక్తి
- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర
- అందరివాడిగా గుర్తింపు..





గడ్డం కేశవమూర్తి

వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పులి సరోత్తం రెడ్డి నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన పోటీ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యాయ లోకానికి సుపరిచితులైన పులి సరోత్తం రెడ్డి ఉపాధ్యాయ సమస్యలపై మొదటి నుంచి తన గళం వినిపిస్తూ వస్తున్నారు. తనకు అవకాశం ఇస్తే ఈ సారి చట్టసభలకు వెళ్లి ఉపాధ్యా సమస్యలపై పోరాడుతానంటున్నారు.

### ఉద్యోగ ప్రస్థానం..

పులి సరోత్తం రెడ్డి 1984లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించారు. మంచి ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొంది సమాజంలో తనదైన ముద్ర వేశారు. సమాజంలోని మంచిచెడులను ఎప్పటికప్పుడు ఎండగడుతూ తన రాజకీయ చతురతను కూడా చూపేవారు. తనకున్న ప్రజాసంబంధాల అనుభవంతో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగలిగారు. 2019లో ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసే వరకు దాదాపు 34 సంవత్సరాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తు నిర్మాణం కోసం తన విలువైన సేవలను అందించారు.

### ఉద్యోగ సంఘం నాయకుడిగా..

ఒకవైపు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే.. మరో వైపు ఉపాధ్యాయ సమస్యలపై 2004 నుంచి 2012 వరకు వరంగల్ జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా పోరాడారు. 2012 నుంచి 2019 వరకు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా తెలంగాణ, ఏపీ రాష్టాలలో తన సేవలను అందించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యోగులకు సెక్రటరీ జనరల్‌గా కూడా తన సేవలను అందించారు. 2019లో తన ఉపాధ్యాయ ఉద్యోగానికి స్వచ్ఛందగా పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

### రాజకీయ అరంగ్రేట్రం..

2019 మార్చిలో జరిగిన వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికలో 1850 ఓట్లను (11శాతం) సాధించి మూడవ స్థానాన్ని సాధించారు. పదవీ విరమణ చేసిన తర్వాత పులి సరోత్తం రెడ్డి 2019 సెప్టెంబర్ లో బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ రిటైర్డ్ టీచర్లకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, ఉద్యోగుల సెల్ కో–చైర్మన్ గా, శక్తి కేంద్రం వంటి బాధ్యతలు చేపడుతున్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గ పరిధిలోని 178, 179, 180 నంబరు పోలింగ్ బూత్‌లకు ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. 2023 నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ బీజేపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేశారు. 2024 ఏప్రిల్ లో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కష్టపడి పనిచేశారు. 2021, 2024 లో వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా తన వంతు పాత్ర నిర్వహించారు.

### బీజేపీ తరుపున పోటీకి ఆసక్తి..

తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టిని బీజేపీ నుంచి వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు పులి సరోత్తం రెడ్డి ఆసక్తి చూపుతున్నారు. దాదాపు 17 వేల మంది ఓటర్లు అర్హులుగా ఉన్న ఈ నియోజకవర్గంలో తనకున్న ప్రజాసంబంధాలు పనికి వస్తాయని అంచనా వేస్తున్నారు. బీజేపీ మద్దతుతో నామినేషన్ వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. 2025 మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయ లోకాన్ని పులి సరోత్తం రెడ్డి అభ్యర్థిస్తున్నారు.

### బయోడేటా..

పేరు :
పులి సరోత్తం రెడ్డి
వృత్తి :
రిటైర్డ్ టీచర్, ఉద్యోగ సంఘ నాయకుడు, రాజకీయ వేత్త
పుట్టిన తేదీ : 06-01-1963
విద్యార్హతలు : బీఎస్సీ, బీఈడీ
తల్లిదండ్రులు :
పులి సులోచన - రామకృష్ణారెడ్డి
భార్య : నీరజ
పిల్లలు :
సింధూ, రాంప్రకాశ్ రెడ్డి
చిరునామా :
2-10-761/1,
ఎస్ బీహెచ్ కాలనీ,
హనుమకొండ
బీజేపీ సభ్యత్వం నం.
1007694786
సెల్ నెంబర్ :
9866019766











WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, నవంబర్ 04, 2024




# నా ప్రాణం వారిపైనే..

- ఆర్థిక సమస్యలు ఉన్నా అందరికీ మేలు చేస్తాం
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో విస్తృత స్థాయి సమావేశం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నా ప్రాణం ఆదివాసి, గిరిజనులు, చెంచుల గురించి కొట్టుకుంటుంది. నేను ఏ శాఖలో ఉన్నా నా మనసు గిరిజన సంక్షేమం మీదే ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్ లో గిరిజన సంక్షేమ శాఖకు చెందిన రాష్ట్ర స్థాయి అధికారులతో సోమవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడతూ ఆదివాసి, గిరిజనులు, చెంచుల సమస్యలు తెలుసుకునేందుకు అచ్చంపేట వంటి ప్రాంతాలకు వెళుతుంటానని ప్రకటించారు. గిరిజన సంక్షేమ శాఖ మొత్తం ఇక్కడ సమావేశం కావటం అభినందనీయమన్నారు. మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక లక్షాన్ని నిర్దేశించుకోవడంతోపాటు ఫలితాలను మెరుగుపరుచుకునేందుకు ఈ సమావేశం దోహదపడుతోందననారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న టీచర్ల పదోన్నతులతో పాటు బదిలీల ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి పూర్తి చేశారని గుర్తు చేశారు. ఐదు వేల మంది ఆశ్రమ పాఠశాల టీచర్లకు ప్రయోజనం జరిగిందన్నారు. గత ప్రభుత్వం చెసిన అప్పులతో గంటకు మూడు కోట్లు వడ్డీ చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ మా ప్రభుత్వం ఉద్యోగులకు, విద్యార్థులకు మేలు చేస్తోందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు, ఉద్యోగులు, టీచర్లు వారధులుగా నిలువాలన్నారు.

## ఇష్టంగా పనిచేయాలి..

కష్టాన్ని ఇష్టంగా చేసుకుని పని చేయాలని, అప్పుడే పనిలో సంతృప్తి కలుగుతుందన్నారు. విద్యార్థులను సొంత పిల్లలుగా తీర్చిదిద్దాలన్నారు. గిరిజన విద్యార్థులు అందరిలో ముందంజలో నిలిపేలా పనిచేయాలన్నారు. అప్పుడు విద్యార్థులు మిమ్మల్ని జీవితాంతం గుర్తు పెట్టుకుంటారన్నారు. నాది కూడా హాస్టల్ జీవితమే అన్నారు. చిన్నప్పుడు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని గుర్తు చేశారు. హాస్టల్ పిల్లలంటే చులకన భావం ఉంటుందని, మనల్ని అవహేళన చేసేవారికి గుణపాఠం చెప్పేలా కసితో కష్టపడాలి..అప్పుడే ఎదుగుతామన్నారు. గుడాలు, తండాలు, పెంటల నుంచి వచ్చిన పిల్లలు జాతీయ, అంతర్జాతీయ క్రీడ పోటీల్లో పథకాలు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులకోసం పని చేసిన అధికారులను దేవుడిలా కొలుస్తారన్నారు. వేయిలో ఒకరిగా కాకుండా సమాజం గుర్తు పెట్టుకునేలా పనిచేయాలన్నారు. 16 ఏళ్ల తర్వాత కాస్మోటిక్ చార్జీలను మూడు రేట్లు పెంచామన్నారు. ఏడేళ్ల తర్వాత డైట్ చార్జీలను 40 శాతం పెంచామన్నారు. గత ప్రభుత్వం విద్య వ్యవస్థకు చేసిందేమీ లేదన్నారు. హాస్టళ్లలో గతంలో కొనుగోలు చేసిన వస్తువులపై విచారణ జరిపిస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలు సృష్టించి బయట శక్తులు మనకు అపఖ్యాతి తెచ్చే కుట్రలు చేస్తున్నారని, హాస్టల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఐటీడీఏ పనితనాన్ని మెరుగుపర్చాలని, కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలను తీర్చే విధంగా పనిచేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేయడాన్ని అదృష్టంగా భావించాలన్నారు.

## అందుబాటులోకి హెల్త్ మానిటరింగ్ యాప్..

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుఅందరికీ హెల్త్ మానిటరింగ్ యాప్ ను తీసుకురావడం అభినందనీయమన్నారు. టీచర్లు మనసుపెట్టి పని చేయాలన్నారు. కాస్మోటిక్, డైట్ చార్జీలు భారీగా పెంచిన సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. చార్జీలు పెంచేందుకు కృషి చేసిన మంత్రి సీతక్కను గిరిజన గురుకులాలు ఆశ్రమ పాఠశాలల టీచర్లు, ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా సన్మానించాయి. ఈ సందర్భంగా వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. అలాగే ఉన్నత విద్యా సంస్థల్లో సీట్లు సంపాదించిన పలువురు విద్యార్థులకు ల్యాప్ టాప్ లను బహుకరించారు.

# నూతన ప్రజాస్వామిక విప్లవానికి పోరాడుదాం

- సీపీఐఎంఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి
- కొనసాగుతున్న వీరుల స్మారక వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, నెక్కొండ :** భూమి, భుక్తి ,పేద ప్రజల విముక్తి కోసం పోరాడుతూ భారత విప్లవోద్యమంలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవ వీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించుకోవాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 1 నుంచి 9 వరకు భారత విప్లవోద్యమ వీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నెక్కొండ మండల కేంద్రంతోపాటు సీతారాంపురం గ్రామంలో డివిజన్ నాయకులు కత్తుల కొమురయ్య ఎర్రజెండాలను ఎగురవేసి అమరవీరులను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ఆర్థిక సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ సామ్రాజ్యవాద పెట్టుబడిదారి కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం, భద్రతతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు పేదరికం, నిరుద్యోగం, కుల, మత ఆర్థిక అసమానతలు రూపుమాపడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్ లైన్ నర్సంపేట డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, దార లింగన్న, గడి కొప్పుల రవి, వీరారెడ్డి, సాంబయ్య, మురళి, మనోహర చారి, జవహర్ లాల్, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో 'దాస్యం'

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమంలో మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అశ్వవాహన సేవ, శ్రీ విష్ణు సహస్ర స్తోత్ర పారాయణం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ స్వామివారి అనుగ్రహం, చల్లని దీవెనలు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు సాయి ప్రసాద్ శ్రీరంగం, ప్రభాకర్ రెడ్డి, పద్మావతి, మనోహర్ రావు, నాగేశ్వరరావు, అర్చకులు వాసుదేవచార్యులు, నాయకులు వెంకన్న, జానకిరాములు పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి యోగా పోటీలు

- పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు
- స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 17 సంవత్సరాల బాల బాలికల యోగా ఆసనాల పోటీలు సోమవారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ దసురు నాయక్, వరంగల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ సారంగపాణి, కన్వీనర్ బొలిశెట్టి కమలాకర్, ఫిజికల్ డైరెక్టర్లు కుండే కిరణ్, శ్రీనివాస్, సోమన్న, కిషన్ నాయక్, పాషా, ప్రభాకర్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయురాలు కోట రజిత తదితరులు పాల్గొన్నారు. ఈరోజు జిల్లా స్థాయిలో ఎంపికైన యోగ క్రీడాకారులు ఈ నెల 6,7,8 వ తేదీల్లో వరంగల్ నగరంలోని కెమిస్ట్రీ, డ్రగ్గిస్ట్ భవనంలో నిర్వహించనున్న అంతర జిల్లా పోటీలకు క్రీడాకారులందరూ హాజరు కావాలని కన్వీనర్ బొలిశెట్టి కమలాకర్, దాసుర్ నాయక్ కోరారు.




# ఎంఏ తెలుగులో స్పాట్ అడ్మిషన్లు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హంటర్ రోడ్డులోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద విజ్ఞాన పీఠం వరంగల్ ప్రాంగణంలో ఈ నెల 5, 6 తేదీల్లో ఎంఏ రెగ్యూలర్ తెలుగు కోర్సులో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జానపద విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్ పోర్టు సైజు ఫోటోలు వెంటతీసుకుని హాజరు కావాలననారు. ఇతర వివరాలకు 9030999640 సెల్ నంబర్ లో సంప్రదించాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com